ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి
జిల్లా వార్తలు

5★ గురువారం 29 ఆగస్టు 2024

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి 8లో..

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు : కలెక్టర్ 8లో..



ఆర్ఎంపీలు, పీఎంపీలపై ఆంక్షలు

- సూదులు వేయవద్దు, మందులు రాయవద్దు..
- వైద్య, ఆరోగ్య శాఖ అధికారుల ఆదేశాలు
- నిరసిస్తూ నేటి నుంచి వైద్య సేవల నిలిపివేత
- ఆందోళన చెందుతున్న గ్రామీణ ప్రాంత ప్రజలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

గ్రామీణ ప్రాంతాల్లో ఏ చిన్న జబ్బు వచ్చినా తక్షణమే వైద్యం అందించే ఆర్ఎంపీలు, పీఎంపీలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులు ఆంక్షలు విధించారు. గత వారం, పది రోజులుగా జిల్లా ఆరోగ్య శాఖ అధికారులు, మెడికల్ కౌన్సిల్ అధికారులు ఆర్ఎంపీ, పీఎంపీల వైద్యాలయాలను తనిఖీ చేస్తూ భయాందోళనకు గురి చేస్తున్నారు. ఆర్ఎంపీ, పీఎంపీలు గ్రామాల్లో ఇంజక్షన్లు వేయొద్దు, మందులు రాయవద్దు అని, కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని ఆంక్షలు పెడుతున్నారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో పలువురు ఆర్ఎంపీలు, పీఎంపీలు కొన్నేళ్లుగా వైద్య సేవలు అందిస్తూ ఉపాధి పొందుతున్నారు. వైద్య శాఖాధికారులు దాడులు చేస్తుండడంతో వైద్య సేవలు అందించడంపై వారు అయోమయంలో పడ్డారు. అంతేకాక గ్రామీణ ప్రజలకు వైద్యం అందించకపోతే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురికానున్నారు. సాధారణంగా జ్వరం వచ్చినా, తలనొప్పి వచ్చినా, జలుబు, దగ్గు వచ్చినా గ్రామీణ ప్రజలు వెంటనే గ్రామాల్లో ఉండే ఆర్ఎంపీలు, పీఎంపీలను సంప్రదిస్తుంటారు. వారికి మందులు ఇవ్వడంతో పాటు అవసరాన్ని బట్టి ఇంజక్షన్లు కూడా వేస్తున్నారు. అలాగే వివిధ రోగాలకు సంబంధించి వైద్య నిపుణుల వద్ద చికిత్స చేయించుకుని వచ్చే రోగులకు డాక్టర్లు సూచించిన మేరకు ఇంజక్షన్లు వేయించుకోవాల్సి ఉంటుంది. ఆ ఇంజక్షన్ల కోసం జనం ఆర్ఎంపీలనే సంప్రదిస్తూ ఉంటారు. ఈ తంతు గ్రామాల్లో ఏళ్ల తరబడి కొనసాగుతున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆర్ఎంపీ, పీఎంపీలకు శిక్షణ ఇవ్వాలని శిక్షణ పూర్తి తరువాత వారికి సర్టిఫికెట్లు అందించాలని అధికారులను ఆదేశించారు. ఆయన ఆదేశాలతో తొమ్మిది నెలలు శిక్షణ కూడా అందించారు. కానీ ఇప్పటివరకు ఏ ప్రభుత్వం కూడా తమను గుర్తించలేదని ఆర్ఎంపీ, పీఎంపీలు తెలిపారు. ఎన్నికల్లో మాత్రం ఆయా పార్టీల నాయకులు తమకు వాడుకొని వదిలివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు ఆర్ఎంపీ, పీఎంపీలు నిర్వహిస్తున్న ప్రథమ చికిత్స కేంద్రాలపై దాడులు చేయడం వల్ల వారిని రోడ్డుపై పడేయడమేననే విమర్శలు వస్తున్నాయి. ప్రజలకు చిన్నపాటి వైద్యం అందిస్తూ ఏళ్లుగా జీవనం కొనసాగిస్తు న్నారు. కానీ ఇప్పుడు సూదులు వేయవద్దు, మందులు రాయవద్దు, సెలైన్లు పెట్టొద్దు అనే ఆంక్షలు పెట్టి వారిని హెచ్చరిస్తున్నారు. దీంతో కొన్ని గ్రామాల్లో వైద్య సేవలు నిలిపివేయడంతో సామాన్య ప్రజలు ఇబ్బందులకు గురవు తున్నారు. రాత్రి అనకా, పగలనకా గ్రామీణ ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందిస్తున్నారు. ఆర్ఎంపీ, పీఎంపీలు గ్రామాల్లో లేకపోతే చిన్న వైద్య సేవలకు కార్పొరేట్ ఆసుపత్రులకు పోతే ల్యాబ్ టెస్టులు, ఫీజులు, స్కానింగ్‌లు చేసి తమపై ఆర్థిక భారాన్ని మోపుతారని ప్రజలు అంటున్నారు. ఆర్ఎంపీలు నిరంతరం ప్రజల మధ్యలో ఉండటం వల్ల తమ ప్రాణాలకు భరోసాగా ఉంటారని వారు ధీమాగా ఉంటున్నారు. కానీ ఆర్ఎంపీలను వైద్యం చేయ కుండా నిరోదిస్తున్న అధికారుల తీరు చూస్తుంటే కార్పొరేట్, ప్రైవేట్ ఆసుపత్రులకు వాంత పాడేలా ఉందనే విమర్శలు వస్తున్నాయి. కార్పొరేట్, ప్రైవేట్ ఆసుపత్రులకు పోయి వచ్చిన తర్వాత కూడా ఆర్ ఎంపీలే కీలకమని ప్రజలు భావిస్తున్నారు. కార్పొరేట్ ఆసుపత్రికి వెళ్లాక అక్కడ రాసిన ఇంజక్షన్లతో పాటు మందులు చెప్పడానికి గ్రామీణ వైద్యులు లేకుంటే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. చిన్నచిన్న సమస్యలకు కార్పొరేట్ ఆసుపత్రులకు పోతే డబ్బులు ఎన్ని పెట్టుకోవాలని అంటున్నారు. గ్రామాల్లో నిరుపేద కుటుంబాలు, కూలీలు ఉన్నారని కార్పొరేట్ ఆసుపత్రికి పోకుండా ప్రభుత్వ ఆసుపత్రికి పోతే, అక్కడ డాక్టర్లు నిర్ణీత సమయం వరకే ఉంటారని, వైద్యం అందించేందుకు ఎవరు ఉండరని, ఏఎన్ఎంలు ఇచ్చే మందులను తీసుకునే పరిస్థితి ఉంటుందని ప్రజలు అంటున్నారు.

● నేటి నుంచి వైద్య సేవల నిలిపివేత

జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ దాడులను నిరసిస్తూ జిల్లాలో గ్రామీణ ప్రాంతంలో వైద్య సేవలను ఈనెల 29వ తేదీ నుంచి నిలిపివేస్తున్నట్లు ఆర్ఎంపీ, పీఎంపీల సంఘం జిల్లా అధ్యక్షుడు టి శ్రీనివాసమూర్తి ప్రక టించారు. పెద్దపల్లి బస్టాండ్ వద్దగల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఉదయం 11 గంటలకు ఆందోళన చేస్తామని ప్రకటించారు. ప్రభుత్వం స్పందించే వరకు తాము గ్రామాల్లో వైద్య సేవలను కొనసాగించబోమని స్పష్టం చేశారు.

ఆర్ఎంపీలు, పీఎంపీలు క్వాలిఫైడ్ డాక్టర్లు కారు..

- డాక్టర్ ప్రమోద్ కుమార్, డీఎంహెచ్‌వో

ఆర్ఎంపీ, పీఎంపీలు క్వాలిఫైడ్ డాక్టర్లు కాదని, వాళ్ల సూదులు ఇవ్వడం, మందులు రాయడం, సెలైన్లు పెట్టడం నిబంధనలకు విరుద్ధం. వాళ్ల కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి. కొందరు ల్యాబ్‌లు, మెడికల్ షాపులను కూడా నడుపుతున్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకున్నాం. ప్రజలు క్వాలిఫైడ్ డాక్టర్లు మాత్రమే సంప్రదించాలి. ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాలకు వెళ్లి వైద్యం చేయించుకోవాలని కోరారు.

గోదాం నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ



రాగినేడులో గోదాం నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 28 : అప్పన్నపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రాగినేడులో స్వంత నిధులతో 20లక్షల రూపాయలతో నిర్మిస్తున్న గోదాం నిర్మాణానికి బుధవారం పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యేను ప్రాథమిక వ్యవసాయ సంఘం సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ రాగినేడు గ్రామ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని విడతల వారీగా గ్రామంలోని అన్ని రోడ్లను పూర్తి చేస్తామని, త్వరలోనే గోదాం అందుబాటులోకి తీసుకువచ్చేలా పనులు త్వరితగతిన పూర్తిచేసేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ చింతపండు సంపత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గుమ్మడి విజయ్, సింగిల్ విండో డైరెక్టర్‌లు చింతపండు మల్లయ్య, ఎల్లెంకి స్వామి, సోమ చంద్రయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అందరికి న్యాయం..

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అన్ని రంగాల వారికి న్యాయం చేకూరుతుందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు. బుధవారం మండలంలోని కాపులపల్లి గ్రామ మాజీ సర్పంచ్ గోపు కవిత-శ్రీనివాస్‌తో పాటు మాజీ వార్డు సభ్యులు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ చేరగా పార్టీ కండువాలు వేసి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో మాజీ ఉపసర్పంచ్ నల్లవెల్లి అశోక్, మాజీ వార్డు సభ్యులు రాజేశ్వర్‌రెడ్డి, సింగిరెడ్డి, మ్యాదరవేణి చొక్కయ్య, తడవేని కుమార్, తాడవేని రవితో పాటు బాణాల తిరుపతిరెడ్డి, బోడకుంట శంకర్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సివిల్ సర్జన్ గైనకాలజిస్టును సస్పెండ్ చేసిన కలెక్టర్

పెద్దపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన జిల్లా కేంద్రంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో డిప్యూటీ సివిల్ సర్జన్ గైనకాలజిస్టుగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ అయేషాఉస్మాన్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ కోయ శ్రీహర్ష మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా కేంద్రంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో డిప్యూటీ సివిల్‌సర్జన్ గైనకాలజిస్టుగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ అయేషాఉస్మాన్ 8 నెలల నుంచి విధులకు సరిగ్గా హాజరుకావడం లేదని పేర్కొన్నారు. ముందస్తు అనుమతి లేకుండా సెలవులు వినియోగించుకోవడం గమనించామని, గత 8 నెలలో ఆ డాక్టర్ ఒకరోజు కూడా రెసిడెంట్ డాక్టర్‌గా 24 గంటల డ్యూటీ నిర్వహించలేదని తెలిపారు. ఎమర్జెన్సీ సేవల్లో విధులు నిర్వహించే వైద్యురాలు విధులపై చూపుతున్న నిర్లక్ష్యాన్ని పరిగణనలోకి తీసుకుంటూ డిప్యూటీ సివల్ సర్జన్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ప్రభుత్వ గైనకాలజిస్టులు వారికి కేటాయించిన డ్యూటీ సమయంలో ఆస్పత్రుల్లో పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఎత్తిపోతలు

పెద్దపల్లి, ధర్మారం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరుకు నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. బుధవారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి 2,892 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. వరద ప్రవాహం తగ్గుముఖం పట్టినప్పటికీ నంది పంప్‌హౌస్‌లోని 3 మోటార్ల ద్వారా గాయత్రి పంప్‌హౌస్‌కు, అక్కడి నుంచి మిడ్ మానేరుకు 9,450 క్యూసెక్కుల నీటిని, ఎన్టీపీసీ, హైదరాబాద్, జిల్లా తాగునీటి అవసరాలకు 452 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. మొత్తం ఔట్ ఫ్లో 9902 క్యూసెక్కులు ఉంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 17.220 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.

క్రీడలతో పాటు విద్యలో రాణించాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమ-సురేష్‌రెడ్డి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రమసురేష్‌రెడ్డి

మంథని, ఆగస్టు 28: క్రీడలతో పాటు విద్యార్థులు చదువులో రాణించి ఉత్తమ పౌరులుగా ఎదగాలని మంథని మున్సిపల్ చైర్ పర్సన్ పెండ్రి రమ-సురేష్‌రెడ్డి సూచించారు. స్థానిక గ్రౌండ్ మంథని జోన్ స్థాయి ఎస్‌జీఎఫ్ గ్రేమ్స్‌ను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్రీడల వలన శారీరానికి వ్యాయామం, ఆరోగ్యం, ధృత్వం, స్నేహభావం ఏర్పడుతుందన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తారని, క్రీడాకారులకు ఎలాంటి వసతులు కావాలన్న తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. క్రీడా సౌకర్యాల కల్పన కోసం, క్రీడాకారులను ప్రోత్సహించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం విద్యార్థులతో కబడ్డీ ఆడి వారిలో ఉత్సాహాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, టీచర్లు, పీఈటీలు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కోల్‌సిటీ, ఆగస్టు 28: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న శానిటేషన్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఏగౌస్, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యవర్గసభ్యుడు మద్దెల దినేష్ కోరారు. ఈమేరకు బుధవారం వారు కమిషనర్ శ్రీకాంత్ వినతిపత్రం అందజేశారు.

ఆరోగ్యంగా ఉంటేనే సమర్థవంతంగా విధులు : సీపీ శ్రీనివాస్



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, ఆగస్టు 28: ఆరోగ్యమే మహాభాగ్యమని, ఆరోగ్యంగా ఉంటేనే సమర్థవంతంగా విధులు నిర్వహించగలమని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ అన్నారు. రామగుండం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం పోలీస్ కమిషనరేట్ హెడ్ క్వార్టర్స్ ఆవరణలో పోలీస్ అధికారులకు, సిబ్బందికి ఉచిత హెల్త్‌క్యాంప్‌ను నిర్వహించగా సీపీ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది నిత్యం విధి నిర్వహణలో ఉంటూ తమ ఆరోగ్యం పట్టించుకోకపోవడంతో ఎన్నో రకాల అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. ట్రాఫిక్ సిబ్బంది విధులు నిర్వహిస్తూ దుమ్ము, దూళి, వెహికల్ పొల్యూషన్‌కు ప్రభావితం కావడం జరుగుతుందన్నారు. ఆరోగ్యంపై అవగాహన ఎంతో ముఖ్యమని, అధికారులు, సిబ్బంది ఆరోగ్యంపై అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని, పోలీసు దినచర్య, జీవన విధానం మిగతా వారితో పూర్తి భిన్నంగా ఉంటుందని, ఇందుకు మన ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోక తప్పదన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వ్యాధులు ఎంతో వేగంగా విస్తరిస్తున్నాయని, వ్యాధుల బారిన పడకుండా తగిన ఆరోగ్య సూచనలు పాటిస్తే ఎంతో మంచిదన్నారు. మనం తీసుకునే అన్ని రకాల ఆహారపదార్థాల విషయంలో జాగ్రత్తగా తీసుకోవాలని సూచించారు. ప్రస్తుత సమాజంలో ఎంతో అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుబాటులో కలవని 40సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరు ప్రతి మూడు నెలలకు ఒకసారైనా మన ఆరోగ్యం కోసం డాక్టర్లను సంప్రదించి మందులు వాడే దానికంటే ముందు జాగ్రత్తలు తీసుకోవడం చాలా మంచిదని సూచించారు. వైద్య సేవలు అందించిన వైద్యులకు, లయన్స్ క్లబ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వైద్య శిబిరంలో అనుభవజ్ఞులైన డాక్టర్లచే కంటి పరీక్షలు, డెంటల్, ఆర్థోపెడిక్, బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర, ట్రాఫిక్ ఏసీపీ నరసింహులు, ఏఆర్ ఏసీపీలు ప్రతాప్, సురేంద్ర, మంచిర్యాల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, పెద్దపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అనిల్, ఆర్ఐలు దామోదర్, మధు, శ్రీనివాస్, సంపత్, వామనమూర్తిలు, లయన్స్‌క్లబ్ అధ్యక్షులు పీ మల్లికార్జున్, జోన్ చైర్మన్ కే రాజేందర్, సెక్రటరీ ఎల్లప్ప, కోశాధికారి గోవర్ధన్‌రెడ్డి, వైద్యులు కే లక్ష్మీప్రసాద్, కె. గోపికృష్ణ, శ్రీకాంత్, నాగిరెడ్డి, దుర్గ ప్రసాద్, మల్లికార్జున్, రామగుండం పోలీస్ కమిషనరేట్ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు బోర్లకుంట పోచలింగం, ట్రాఫిక్, ఏఆర్ సిబ్బంది, పలువురు హోంగార్డులు పాల్గొన్నారు.

రామగుండం మున్సిపల్ సిబ్బందికి రెయిన్‌కోట్లు పంపిణీ



సిబ్బందికి రెయిన్‌కోట్లు అందజేస్తున్న మేయర్ అనీల్ కుమార్

కోల్‌సిటీ, ఆగస్టు 28: మున్సిపల్ కార్మికులకు అందించే అన్ని ప్రయోజనాలను వర్తింప జేస్తున్నామని రామగుండం మేయర్ బంగి అనిల్ కుమార్ అన్నారు. బుధవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో క్షేత్ర స్థాయి సిబ్బందికి రెయిన్ కోట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు పని ముట్లు, రక్షణ సామగ్రి, చెప్పులు, కొబ్బరి నూనె, బెల్లం, దుస్తులు క్రమం తప్పకుండా ప్రతి ఏటా ఇస్తున్నామని అన్నారు. కాగా అంతకు ముందు మెప్మా సిబ్బందితో సమావేశం నిర్వహించి ఈ నెల 31న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు చేతుల మీదుగా గోదావరిఖని చౌరస్తాలో స్వశక్తి మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజీ చెక్కుల పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నందున లబ్దిదారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యేలా చూడాలని మేయర్, కమిషనర్ కోరారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్, కార్పొరేటర్లు మహంకాళి స్వామి, బొంతల రాజేష్, ముస్తఫా, నాయకులు పాతపెల్లి ఎల్లయ్య, పెద్దెల్లి ప్రకాష్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు మురళీధర్‌రావు, యాకయ్య, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ మధూకర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి ప్రభుత్వం కృషి : ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

జ్యోతినగర్, ఆగస్టు 28 : రాష్ట్రంలో క్రీడా రంగం అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ అన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించాలన్న ఉద్దేశ్యంతో రాష్ట్రంలో రాష్ట్ర, జాతీయ క్రీడా పోటీలను నిర్వహించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నాడని తెలిపారు. బుధవారం ఎన్టీపీసీ టీటీఎస్‌లోని జడ్పీ పాఠశాల మైదానంలో 3 రోజులపాటు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమ్మడి రామగుండం స్థాయి క్రీడా పోటీలను మక్కాన్‌సింగ్ ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రసంగిస్తూ క్షేత్రస్థాయిలో క్రీడలను ప్రోత్సహించడంలో భాగంగా ప్రతి నియోజకవర్గంలో మినీ స్టేడియాలను నిర్మిస్తున్నామన్నారు. అలాగే రాష్ట్రంలో స్పోర్ట్స్ యూనివర్శిటీ ఏర్పాటుకు సీఎం నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల పట్ల ఆసక్తి చూపాలని, క్రీడల వల్ల విద్యార్థులు విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మండల స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలలో పాల్గొంటున్న విద్యార్థులు భవిష్యత్‌లో జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కాగా, 3 రోజుల పాటు జరిగే క్రీడలలో రామగుండం ఈస్ట్, వెస్ట్, అంతర్గాం, పాలకుర్తి మండలాలకు చెందిన విద్యార్థులు పాల్గొంటున్నారు. మొదటి రోజు బాలికల అండర్ 14, 17 విభాగంలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో అంశాల్లో పోటీలు జరిగాయి. గురువారం బాలురకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు, శుక్రవారం బాల, బాలికలకు అథ్లెటిక్స్ పోటీలు జరుగుతాయి. పోటీల ప్రారంభ కార్యక్రమంలో టీటీఎస్ జెడ్పీ స్కూల్ హెచ్ఎం జయరాజ్, గోదావరిఖని బాలిక పాఠశాల హెచ్ఎం జింక మల్లేశం, పీఈటీ జావేద్, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి నాణ్యతను నిరంతరం పరీక్షించాలి : కలెక్టర్

పెద్దపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ ద్వారా జిల్లాలోని పరిధిలో జనావాసాలకు నాణ్యమైన తాగునీరు సరఫరాకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మంగళవారం ఆయన జిల్లా కలెక్టరేట్‌లో మిషన్ భగీరథ తాగు నీటి సరఫరాపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణశ్రీతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి గ్రామానికి, జనావాసానికి ఓవర్ హెడ్ ట్యాంకుల ద్వారా అవసరమైన మేర శుద్ధి చేసిన బల్క్ తాగునీటిని సరఫరా చేయాలని గ్రిడ్ అధికారులను ఆదేశించారు. గ్రామాలకు సరఫరా చేసే తాగునీటి నాణ్యత అంశంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రతి రోజూ గ్రామాలలో సరఫరా చేసే తాగునీరు నాణ్యతను ల్యాబ్‌లో పరీక్షించి రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు, సంక్షేమ హాస్టల్స్ ప్రభుత్వ పాఠశాలలు తనిఖీ చేసి, అక్కడ అవసరాల మేర నీరు సరఫరా జరిగేలా చూడాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని గ్రామాలు, ఇతర జనాలకు సరఫరా అవుతున్న మిషన్ భగీరథ బల్క్‌నీటిని ప్రతి ఇంటికి అందించేలా ఇంట్రా అధికారులు చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా సరఫరాలో నీటి లీకేజీలు మొదలగు ఇబ్బందులు ఏర్పడితే అందుబాటు నిధులతో మరమ్మత్తు పనులు త్వరితగతిన చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత, ఈఈ మిషన్ భగీరథ గ్రిడ్ పూర్ణ చందర్‌రావు, ఇంట్రా ఈఈ శ్రీనివాస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు

- జిల్లా క్రీడలు, యువజన శాఖ అధికారి సురేష్



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా క్రీడాభివృద్ధి అధికారి సురేష్

సుల్తానాబాద్, ఆగస్టు 28: గ్రామీణ ప్రాంతంలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని జిల్లా క్రీడలు యువజన శాఖ అధికారి ఓ సురేష్ అన్నారు. సుల్తానాబాద్ పట్టణంలోని సెయింట్ మెరీ స్కూల్‌లో గురువారం స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. పోటీలలో అండర్ 14, అండర్ 17 విభాగాలలో బాలబాలికలకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడాపోటీలను నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభంలో జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించి అనంతరం డీవైఎస్‌వో మాట్లాడుతూ క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసానికి దేహదారుఢ్యానికి దోహదపడతాయన్నారు. క్రీడల వల్ల అనేక ప్రయోజనాలుఉన్నాయని, ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలలో ప్రభుత్వం రెండు శాతం రిజర్వేషన్లు అమలు చేస్తుందని, గ్రూప్-1 పరీక్షల్లో కూడా క్రీడా సర్టిఫికెట్లు కలిగి ఉన్న క్రీడాకారుల అభ్యర్థులకు రిజర్వేషన్ల ద్వారా ఉద్యోగ అవకాశాలు ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ప్రాథమికస్థాయి నుంచే పిల్లలకు క్రీడలను నేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్, కుమార్ కిషోర్, పెద్దపల్లి ఎస్‌జీఎఫ్ జోన్ కన్వీనర్ దాసరి రమేష్, మండల కన్వీనర్ తాండ్ర ప్రణయ్, కరస్పాండెంట్ హెచ్ఎం శౌరెడ్డి, సీనియర్ క్రీడాకారులు, పీడీలు, పీఈటీలు గెల్లు మధుకర్, దాసరి ప్రసాద్, సంపత్, సత్యం, సంధ్య, ఇక్బాల్,శివ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కేశవపట్నం బస్టాండ్‌లో ప్రయాణికురాలి పర్స్ చోరీ

దొంగకు దేహశుద్ధి చేసిన స్థానికులు

శంకరపట్నం, ఆగస్టు 28 : మండల కేంద్రంలోని బస్టాండ్‌లో బుధవారం ఓ మహిళ పర్సు దొంగిలించిన వ్యక్తిని వెంటాడి పట్టుకొని బాధిత మహిళ, స్థానికులు దేహశుద్ధి చేశారు. వీణవంక మండలం ఘన్ముక్కుల గ్రామానికి చెందిన ఓ ప్రయాణికురాలు బస్ కొరకు బస్టాండ్‌లో వేచిచూస్తున్న సమయంలో ఓ వ్యక్తి పర్సు, ఫోన్‌ను దొంగలించాడు. అప్రమత్తమైన మహిళ దొంగను పట్టుకొని దేహశుద్ధి చేయగా గమనించిన స్థానికులు చోరీ చేసిన వ్యక్తిని పోలీసులకు అప్పగించే ప్రయత్నం చేయగా అక్కడి నుంచి పారిపోయినట్లు తెలిపారు.

సెప్టెంబరు 1న ఉమ్మడి జిల్లా సబ్ జూనియర్ ఖోఖో జట్ల ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్ , ఆగస్టు 28: కరీంనగర్ జిల్లా కోకో అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 1వ తేదీన కరీంనగర్ ఉమ్మడి జిల్లా సబ్ జూనియర్ ఖోఖో జట్ల ఎంపిక పోటీలను నిర్వహించనున్నారు. మానకొండూరు మండలం దేవంపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో బాల బాలికల విభాగాలలో ఉదయం 9 గంటల నుంచి ఈ ఎంపిక పోటీలను నిర్వహించనున్నామని జిల్లా కోకో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై మహేందర్‌రావు తెలిపారు.

పోటీలలో పాల్గొనుటకు ఆసక్తి గల క్రీడాకారులు ఆధార్ కార్డు ఒరిజినల్‌తో పాటు జిరాక్స్ పుట్టినతేదీ సర్టిఫికెట్, స్టడీ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. క్రీడాకారుల ఇండెక్స్ బాల బాలికలకు ఎత్తు సెంటీమీటర్లలో, బరువు కిలోల్లో, వయస్సు సంవత్సరాలలో మొత్తం 215 పాయింట్లు దాటకుండా ఉండాలి. వయస్సు 3-10-2010 తేదీ తర్వాత జన్మించిన వారు. 14 వత్సరాలలోపు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. ఈ పోటీలలో ప్రతిభ చాటే క్రీడాకారులను సెప్టెంబర్ 13,14,15 తేదీలలో ఖమ్మంలో జరగనున్న 34వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ ఖోఖో పోటీలకు ఎంపిక చేయనున్నామని ఆయన తెలిపారు.

గడ్డి మందు కొట్టిన మేత తిని మేకలు మృతి

వేములవాడ రూరల్, అగస్టు 28: మండలంలోని బాలరాజుపల్లిలో గడ్డి మందు కొట్టిన మేత తిని మేకలు బుధవారం మృతి చెందాయి. స్థానికుల కథనం ప్రకారం బాలరాజుపల్లి గ్రామానికి చెందిన పోచనేని ప్రమీల, సత్తయ్య రోజూ మాదిరిగానే బుధవారం ఉదయం తమ మేకలను మేతకు తీసుకెళ్లారు. మధ్యాహ్నం సమయంలో ఓ రైతు పొలం వద్దకు చేరుకున్న మేకలు గడ్డి మందు కొట్టిన మేతను తినడంతో ఎనిమిది మేకలు అక్కడికక్కడే మృతి చెందాయి. మేకలు మృతి చెందడంతో యజమానులు బోరున విలపించారు. తమకు 1,50,000 రూపాయల నష్టం జరిగిందని ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేసారు.

నకిలీ అల్లోపతి వైద్యశాలల్లో అధికారుల తనిఖీలు



పెద్దపల్లిలో తనిఖీలు చేస్తున్న అధికారులు

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 28: పెద్దపల్లి జిల్లా కేంద్రంతో పాటు సుల్తానాబాద్‌లోని పలు నకిలీ అల్లోపతి వైద్యశాలల్లో అధికారులు తనిఖీలు నిర్వహించారు. తెలంగాణ వైద్య మండలి ఛైర్మన్ డాక్టర్ మహేష్ కుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ లాలయ్య ఆదేశాల మేరకు సభ్యులు డాక్టర్ రాజకుమార్ ఆధ్వర్యంలో టీజీఎంసీ తనిఖీ బృందం పెద్దపల్లి, సుల్తానాబాద్‌లలో నకిలీ అల్లోపతి వైద్యుల సెంటర్లపై బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో పెద్దపల్లిలోని లోటస్ హాస్పిటల్, పురుషోత్తం, ఇమ్రాన్ బోన్ సెట్టింగ్స్ సెంటర్, వైఎస్ అజీజ్ క్లినిక్, సుల్తానాబాద్‌లోని నీలకంటేశ్వర్ మెడికల్ షాప్ మల్లేశం, మణికంఠ క్లీనిక్ చిన్న రమేష్ పేరుతో అర్హత లేకుండా పలు సెంటర్లు ఓపెన్‌చేసి వైద్యం చేస్తున్నారని వెలుగులోకి వచ్చిందని తనిఖీ బృందం సభ్యులు తెలిపారు. ఈ తనిఖీల గురించి సమాచారం తెలుసుకుని నకిలీ వైద్యులు తమ క్లీనిక్‌లు, ల్యాబ్స్, పర్మిషన్‌లేని మెడికల్ షాపులను మూసి వేశారని పేర్కొన్నారు. అర్హత లేనివారు వైద్యులుగా చెలామణి అవుతూ యాంటిబయోటిక్స్, స్టెరాయిడ్స్ ఇస్తున్నట్టు గుర్తించి తగిన ఆధారాలు సేకరించామని తెలిపారు. ఎన్ఎంసీ చట్టం ప్రకారం వీరిపై కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో హెచ్ఆర్‌డీఏ సెక్రటరీలు డాక్టర్ శరణ్‌సాయి, సందీప్, భరత్ పాల్గొన్నారు.

● అధికారులు వెళ్లిన తర్వాత..

అల్లోపతి పేరిట అనుమతులు, అర్హతలు లేకున్నా వైద్యం చేస్తున్న నకిలీ వైద్యులపై చర్యలు తీసుకుంటామని, క్లినిక్‌లు సీజ్ చేశామని ఓ వైపు అధికారులు ప్రకటించగా, వారు వెళ్లిన అనంతరం పోలీస్ స్టేషన్ పక్కనే ఉన్న చిన్నరమేష్‌తో పాటు పలు క్లినిక్‌లు తెరిచి యథావిధిగా వైద్యం చేస్తూ కనిపించడం కొసమెరుపు.



నిర్మాణం పూర్తయినా..నిరుపయోగమే
ప్రారంభం కాని ఆసుపత్రి భవనం

మల్యాల, ఆగస్టు 28: మల్యాల ప్రాథమిక ఆసుపత్రి ఆవరణలో నిర్మించిన నూతన ఆసుపత్రి భవనం నిరుపయోగంగా మారింది. అయిదేళ్ల క్రితం రూ.1.31కోట్లతో చేపట్టిన ఈ భవన నిర్మాణ పనులు పూర్తికావడంతో గత శాసనసభ ఎన్నికల ముందు హడావుడిగా ప్రారంభించి నప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. 2018లో ప్రారంభమైన పనులు ఏడాది క్రితం పూర్తయ్యాయి. ఈ ఆసుపత్రికి నిత్యం వందల సంఖ్యలో రోగులు వస్తుండగా సరైన సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైద్య సిబ్బందితో నిర్వహించే సమావేశాలను చెట్ల కింద నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. నూతన భవనంతో రోగులకు ఇక్కట్లు తొలిగిపోయే అవకాశం ఉండగా దాన్ని తెరవడం లేదు. ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని పలువురు పేర్కొంటున్నారు

ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు..

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్ ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తి సామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)
శ్రీరాంసాగర్	5,440	3,822	80.5	53.620
ఎల్లంపల్లి	2,892	9,902	20.175	17.220
మిడ్ మానేరు	10,500	21,000	27.54	17.48
ఎల్ఎండీ	14.802	232	24.034	9.517

రాజకీయాలకు అతీతంగా పనిచేయాలి



కేడీసీసీ బ్యాంకును ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం, ప్రభుత్వ విప్ ఆది

- ఉమ్మడి జిల్లాలో 59 వేల రైతులకు రూ. 444 కోట్లు రుణమాఫీ చేశాం
- యువతకు విదేశీ విద్యా రుణాలు ఇచ్చేందుకు కేంద్రంతో మాట్లాడతాం
- బీసీ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్

వేములవాడ టౌన్, ఆగస్టు 28: రాజకీయ పార్టీలకు అతీతంగా రాజకీయాలకు ఎలాంటి తావు లేకుండా సహకార సంఘాల్లో రైతుల హితం కోసమే మనమందరం పని చేయాలని బీసీ సంక్షేమ, రవాణాశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. వేములవాడలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం 300 మెట్రిక్ టన్నుల గోదాం, ప్యాక్స్ ఆన్‌లైన్ సర్వీస్ డిజిటల్ సేవా కామన్ సర్వీస్ సెంటర్, ది కరీంనగర్ జిల్లా సహకార బ్యాంక్ నూతన భవనాన్ని, ఏటీఎం సెంటర్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం రూ. 2లక్షల రుణమాఫీ చేశామన్నారు. రైతు రుణమాఫీ కాకపోతే సహకార వ్యవస్థ ద్వారా ప్రభుత్వంతో సమ న్వయం చేసి రుణమాఫీ ఇప్పించాలని సూచించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి 59 వేల మంది రైతులకు రూ. 444 కోట్ల రుణమాఫీ జరిగిందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ఆర్ లక్ష రూపాయల రుణమాఫీ చేశారని, ఇప్పుడు రేవంత్‌రెడ్డి రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసి చరిత్రలో నిలిచి పోయారన్నారు. సహకార సంఘాలకు విదేశీ విద్య లోన్‌లు ఇచ్చే అర్హత లేదని అంటున్నట్లు తెలిసిందని, సహకార సంఘాల రైతుల పిల్లలు విదేశాల్లో చదువుకు నేందుకు లోన్‌లు ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడతామని అన్నారు. గతంలో మహిళలకు పావలా వడ్డీ రుణాలు ఇవ్వలేదని, ఇప్పుడు మహిళలకు రుణాలు ఇస్తున్నామన్నారు. మహిళలకు వ్యవసాయ, వ్యవసాయ ఆధారిత చిన్న తరహా పరిశ్రమలు పెట్టుకోవటానికి సహకరిస్తున్నామన్నారు. వేములవాడ లాంటి ప్రాంతాల్లో సహకార సంఘాలు రూ. 150 కోట్ల వ్యాపారం చేస్తున్నారని, రూ. 35 కోట్ల డిపాజిట్‌లు చేయడం అభినందనీయమని అన్నారు.

వైఎస్సార్‌తోనే సహకార సంఘాలకు నూతన వైభవం
ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వైఎస్సార్ ముఖ్యమంత్రిగా వున్న సమయంలోనే సహకార సంఘాలకు నూతన వైభవం వచ్చిందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. కేడీసీసీ బ్యాంకు నూతన భవనం ప్రారంభానికి పొన్నం ప్రభాకర్‌తో కలిసి హాజరైన ఆయన మాట్లాడుతూ సహకార బ్యాంకులు అన్ని వర్గాల వారికి వ్యక్తిగత రుణాలతో పాటు ఇతర దేశాల్లో చదువుకుంటున్న వారికి రుణాలు ఇచ్చే స్థాయికి ఎదగడం అభినందనీయమన్నారు. బ్యాంకు చైర్మన్‌లు అంకిత భావంతో పని చేయడం వల్లే సహకార బ్యాంకులు ఈ స్థాయిలో నిలుస్తున్నాయని అన్నారు. వాణిజ్య బ్యాంకులతో దీటుగా పోటీపడి సహకార బ్యాంకులు ముందుకు వెళ్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్, వైస్‌చైర్మన్ పింగలి రమేష్, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, కేడీసీసీ బ్యాంకు సీఈవో సత్యనారాయణరావు, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్లు ఏనుగు తిరుపతిరెడ్డి, కిషన్‌రావు, స్వామిరెడ్డి, అల్వాల కోటి, మేనేజర్ గుంటి సాయికుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, సీఈవో మిట్ల లక్ష్మణ్ కౌన్సిలర్లు, సంఘం చైర్మన్‌లు తదితరులు పాల్గొన్నారు.

- ఏటా 50లక్షల అదనపు భారం!
- ఏజెన్సీల కైవసానికి పోటాపోటీ
- ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు
- టెండర్ ద్వారానే నియామకాలకు కమిషనర్ ఆదేశాలు

అంజన్నకు 'ఏజెన్సీ'ల గుదిబండ



మల్యాల, ఆగస్టు 28: కొండగట్టు అంజనేయస్వామి దేవస్థానానికి ఔట్‌సోర్సింగ్ నియామకాల ఏజెన్సీలు గుదిబండగా మారుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఏజెన్సీలతో దేవస్థానానికి అదనంగా పెద్ద మొత్తంలో భారం పడే అవకాశం ఉండడమే ఇందుకు కారణం. ఇటీవల ఏజెన్సీల కోసం అనేక మంది పోటా పోటీగా ప్రయత్నాలు చేపట్టడం చర్చనీయంశంగా మారింది. కొందరు ప్రజాప్రతినిధుల అండతో ఏజెన్సీలను కైవసం చేసుకోవడానికి కొన్ని నెలలుగా ప్రయత్నాలు చేస్తుండడంతో కొండగట్టులో ఔట్‌సోర్సింగ్‌లో నియామకాలపై అనేక మంది ఆశలు పెంచుకుంటున్నారు.

గతంలో టెండర్ ప్రక్రియ ద్వారా సిబ్బందిని నియమించుకోగా ఇప్పుడు ఏజెన్సీలతో నియమించడం, దేవస్థానం పరిధిలో ఏజెన్సీ దక్కించుకోవడానికి ప్రజాప్రతి నిధుల చుట్టూ ప్రదిక్షణలు చేస్తూ ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తున్నారు. ఏజెన్సీలతో గతంలో కన్న ఇప్పుడు లక్షల్లో అదనంగా దేవస్థానానికి భారం పడుతుందని పలువురు హిందూ సంస్థల ప్రతినిధులు అంటున్నారు. కొండపైన సెక్యూరిటీ సిబ్బందిని గతేడాది క్రితం వరకు టెండర్ ద్వారా నియమించుకునే వారు. ఇప్పటి ఏజెన్సీ ఖరారు కాకముందు ఒక్కో సిబ్బందికి దేవస్థానం తరపున రూ.6 వేల చొప్పున వేతనాలు అందించగా ప్రస్తుతం ఏజెన్సీ ద్వారా నియమించిన సిబ్బందికి ఒక్కొక్కరికి రూ.15 వేలు చెల్లిస్తున్నట్లు దేవస్థానం అధికారులు పేర్కొంటున్నారు.

గతంలో ఏజెన్సీకి ముందు 11మంది విధులు నిర్వహించగా ఇప్పుడు అదనంగా 9 మందిని మొత్తం 20 మందిని ఏజెన్సీ ద్వారా నియమించారు. దాంతో గతంలో కన్నా ఇప్పుడు దేవస్థానానికి పెద్ద మొత్తంలో భారం పడుతుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తూ అదనపు భారానికి ఇది ఉదాహరణగా చెబుతున్నారు. ఇదిలా ఉంటే గత జూన్ నెలతో ముగిసిన మరో ఏజెన్సీ స్థానంలో కొత్త ఏజెన్సీ కోసం కొందరు పోటీలు పడుతున్నట్లు తెలుస్తోంది. కనీస వేతనాలతో రోజు వారి భత్యంతో నియమించుకునే సిబ్బందిని ఏజెన్సీ ద్వారా నియమించుకోవడం పట్ల విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇటీవల వరకు కొనసాగిన సిబ్బంది తమ విధులు కాకుండా ఆలయంతో విధుల కోసం రాజకీయ నాయకులతో సిఫారసులు చేయించుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో తాము చేయాల్సిన నిర్దేశిత విధులు పక్కన పెట్టేశారని పలువురు విమర్శిస్తున్నారు. రెండు నెలలుగా ఏజెన్సీ సిబ్బంది లేకపోయినా ఎలాంటి ఇబ్బందులు లేవని అలాంటప్పుడు ఏజెన్సీ ద్వారా వచ్చే సిబ్బంది నియామకాలు అంతగా అవసరం ఉండదనే అభిప్రాయాలను ఆలయ వర్గాలతో పాటు పలువురు వ్యక్తం చేస్తున్నారు.

- టెండర్ ద్వారానే నియామకాలు

గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఆ పార్టీకి చెందిన కొందరు ఏజన్సీ దక్కించుకోవడం, ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం రావడం పాత ఏజెన్సీ గడువు ముగియడంతో అధికార పార్టీ నేతలు ఏజన్సీ కోసం జోరుగా ప్రయత్నాలు చేస్తున్నారు. అనేక మంది ఏజెన్సీల కోసం తమ చుట్టూ తిరుగుతుండడంతో ప్రజాప్రతినిధులు తలలు పట్టుకుంటున్నారు. అయితే ఇటీవల దేవాదాయ కమిషనర్ ఏజెన్సీ కాకుండా టెండర్ ద్వారా నియామకాలు చేపట్టాలనే ఆదేశాలు ఇవ్వడంతో ఇక ఏజెన్సీ ఉండదని తమ ప్రయత్నాలకు గడి పడుతుందని తెలియడంతో కొందరు ఏజెన్సీ కోసమేప్రయత్నాలు తీవ్రతరం చేస్తున్నట్లు తెలుస్తుంది.

కమిషనర్ నిర్ణయం మేరకే
రామకృష్ణరావు, ఈవో



టెండర్ ద్వారా సిబ్బందిని నియమించాలని తమకు దేవాదాయ కమిషనర్ నుంచి ఆదేశాలు వచ్చాయి. ప్రస్తుతం అయితే పలు ఆల యాల్లో చేపట్టిన నియామకాలను పరిశీలిస్తున్నాం. తదుపరి కమిషనర్ నిర్ణయం, ఉత్వర్వులు మేరకు తగు చర్యలు తీసుకుంటాం. గతంలో టెండర్ ద్వారా సిబ్బందికి వేతనాలు తక్కువే కాగ ఏజెన్సీలతో ప్రభుత్వం నిర్ధేశించిన కనీస వేతనాలు అందించాల్సి ఉంటుంది.

టెండర్ ద్వారానే నియామకాలు చేపట్టాలి
యాగండ్ల లక్ష్మీనారాయణ, విశ్వహిందూ పరిషత్



అవుట్ సోర్సింగ్‌తో రాజకీయ నాయకులు తమ అనుచరులను నియమించు కోవడం, పైగా దేవస్థానంకు ఏజెన్సీలతో ఏటా అరకోటికి పైగా భారం వాటిల్లుతుంది. భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించకుండా ఈ నియమాకాలతో దేవస్థానం నిధులను ఖర్చు చేయడం సరి కాదు. భక్తులకు సౌక ర్యాల కల్పనతో పాటు సిబ్బందిని నియమించుకోవాలి. మిగితా దేవాలయాల్లో మాదిరిగా ఇక్కడ టెండర్ పద్ధతిలోనే నియమాకాలను చేపట్టాలి.

నార్కొటిక్ డాగ్‌తో విస్తృత తనిఖీలు



నార్కొటిక్ డాగ్‌తో తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ విజయ్‌కుమార్

కరీంనగర్ క్రైం, ఆగస్టు 28 : మత్తు పదార్థాలను పసిట్టడంతో ప్రత్యేక శిక్షణ పొందిన నార్కొటిక్ డాగ్‌తో కరీంనగర్ రెండో రాణా సీఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం నగరంలో పలు ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణ అనంతరం వదిలిపెట్టారు. నగరంలోని ముకరంపుర, కశ్మీరగడ్డ, మంకమ్మతోట ప్రాంతాల్లోని అనుమానిత ప్రదేశాలు, పాన్ షాపులు, కిరాణంషాపులు, హోటళ్లలో నార్కొటిక్ డాగ్‌తో తనిఖీలు నిర్వహించారు. చాక్లెట్ రూపంలో కొందరు గంజాయిని, ఇతర మత్తు పదార్థాలను విక్రయిస్తున్నారనే సమాచారంతో ఈ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో నార్కొటిక్ స్క్వాడ్ పోలీసులతో పాటు రెండో రాణా ఎస్ఐ చీనానాయక్, హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నాటు తుపాకులు తయారు చేస్తున్న వ్యక్తి అరెస్ట్

- కొనుగోలు చేసిన ముగ్గురు అదుపులోకి.. ● రెండు నాటు తుపాకులు, సామగ్రి స్వాధీనం ● ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 28: నాటుతుపాలకులు తయారుచేస్తున్న వ్యక్తితోపాటు కొనుగోలు చేసిన మరో ముగ్గురి అరెస్ట్ చేశామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం రాత్రి ఆయన వివరాలు వెల్లడించారు. గంభీరావుపేట మండలంలోని గజసింగవరం గ్రామానికి చెందిన రాయలింగు శంకర్ అనే వ్యక్తి నాటు తుపాకులు తయారుచేసి వాటిని అదే గ్రామానికి చెందిన అడవి జంతువులను వేటాడే వారికి అమ్ముతున్నాడనే సమాచారం మేరకు అతని ఇంటికి వెళ్లి సోదాలు చేయగా నాటుతుపాకీల తయారీకి సంబంధించిన సామగ్రి లభించిందన్నారు. శంకర్ వద్ద రెండు తుపాకీ బ్యారెల్, తుపాకులు తయారు చేయడానికి వాడే రంపం, సుత్తి, కత్తి, ఆకురాయి, డ్రిల్లింగ్ మిషన్, దూగోడ మిషన్, ఎయిర్ బుల్లోజర్ స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు శంకర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించగా నాటుతుపాకులు కొనుగోలుచేసిన గజసింగవరం గ్రామానికి చెందిన రాయలింగు చంద్రమౌళి, శాతవేణి హరీష్, లోగిడి గంగయ్యలను అదుపులోకి తీసుకొని వారి వద్ద రెండు తుపాకులు, నాలుగు ట్రిగర్ భాగాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు గంభీరావుపేట మండలంలోని గజసింగవరం గ్రామానికి చెందిన రాయలింగు శంకర్(50), రాయలింగు చంద్రమౌళి(40), శత్రవేణి హరీష్(27), లోకిడి గంగయ్య(45)లను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. వీరి అరెస్ట్‌నకు చాకచక్యంగా వ్యవహరించిన ఎల్లారెడ్డిపేట సిఐ శ్రీనివాస్, గంభీరావుపేట ఎస్ఐ రామ్మోహన్, కానిస్టేబుళ్లను ఎస్పీ అభినందించారు. సమావేశంలో సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్‌మహాజన్

చికిత్స పొందుతూ యువకుడి మృతి



రాజ్ కుమార్ (ఫైల్)

బీర్‌పూర్, ఆగస్టు 28: మండలంలోని కొల్వాయి గ్రామానికి చెందిన బేగె రాజ్‌కుమార్ (26) అనే యువకుడు మంగళవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం రాజ్‌కుమార్ నాలుగు నెలల క్రితం జగిత్యాల మండలం గుల్లపెటకు చెందిన రాజశ్రీని ప్రేమ వివాహం చేసుకున్నాడు. రాజశ్రీ అత్త బోగె కమల, ఆడపడుచు సమలత వరకట్నం కోసం రాజశ్రీతో పాటు రాజ్‌కుమార్‌ను కొద్ది రోజులుగా వేధిస్తూ వస్తున్నారు. దీంతో మనస్థాపానికి గురై ఈ నెల 26నా ఉదయం రాజ్ కుమార్ గడ్డి మందు తాగాడు. వెంటనే జగిత్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు కరీంనగర్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. రాజశ్రీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన యువకుల అరెస్టు

ఇల్లంతకుంట, ఆగస్టు 28: పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన యువకులను బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం మండలంలోని ఆరెపల్లి గ్రామంలో ఈ నెల 23న అనుమతి లేకుండా డీజే నడుపుతూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నారనే సమాచారం మేరకు ఏఎస్ఐ సతీష్‌కుమార్ సిబ్బందితో కలిసి గ్రామానికి చేరుకొని డీజేను నిలిపివేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆరెపల్లి గ్రామానికి చెందిన బుర్ర సూర్యగౌడ్, బుర్ర స్వామిచరణ్, సిరికొండ గ్రామానికి చెందిన నీలం మహిపాల్, రేపాక గ్రామానికి చెందిన పోతుగంటి సంజయ్ పోలీసులను నెట్టివేశారు. ఏఎస్ఐ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా డీజే పెట్టిన కేసన్నపల్లె గ్రామానికి చెందిన చిట్యాల హరీష్‌తో పాటు మిగతా నలుగురిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

రెండు బైకులు ఢీ
యువకులకు తీవ్ర గాయాలు

ఎండపల్లి, ఆగస్టు 28: మండలంలోని జగిత్యాల రాజారాంపల్లి ప్రధాన రహదారి ఎండపల్లి వైన్స్ చౌరస్తా వద్ద బుధవారం రెండు బైకులు ఢీ కొట్టడంతో యువకులకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఎండపల్లికి చెందిన మంచికట్ల భీమయ్య, గుళ్లకోట గ్రామానికి చెందిన జనగిరి చిన్నయ్యగా వారిని గుర్తించారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు హుటాహుటిన అంబులెన్స్‌లో క్షతగాత్రులను జగిత్యాల ఆసుపత్రికి తరలించారు.

ప్రభుత్వ భూమిలో మట్టి తరలింపు

- అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

గంగాధర, ఆగస్టు 28: గంగాధర మండలం గోపాల్‌రావుపల్లిలో ప్రభుత్వ భూమిలో అక్రమంగా మట్టితవ్వకాలను గ్రామస్తుల ఫిర్యాదుతో రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. గ్రామ శివారులోని వంటశాల గుట్ట వద్ద గతంలో ఉపాధి హామీలో ఈత,తాటి చెట్లతో పాటు పలు రకాల మొక్కలు నాటారు. ఈ మొక్కలను తొలగించి అక్రమంగా ప్రభుత్వ భూమిలో మట్టి తవ్వకాలు చేస్తున్నారని గ్రామస్తులు అధికారులకు సమాచారం అందించారు. విషయాన్ని తెలుసుకున్న రెవెన్యూ అధికారులు ఘటన స్థలానికి చేరుకుని లారీలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గ్రామానికి చెందిన వైకుంఠధామంకు ప్రహరీ నిర్మించగా దాన్ని తొలగించి అక్రమంగా మట్టితవ్వకాలను చేస్తూ అమ్ముకుంటున్నారని గ్రామస్థులు ఆరోపించారు.



మట్టి తవ్వకాలను నిలిపివేస్తున్న అధికారులు

గంజాయి విక్రయదారుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ మొగిలి

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 28: వేములవాడ మండలంలోని జయారం గ్రామానికి చెందిన డప్పుల వంశీ (23) అనే గంజాయి విక్రయదారుడిని బుధవారం అరెస్ట్ చేశామని సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి తెలిపారు. వంశీ ఇంటర్ వరకు చదువుకొని గంజాయికి అలవాటుపడి హైద్రాబాద్‌లోని సినిమాటోగ్రఫీ కోర్సు చేసే సమయంలో జల్సాలకు పాల్పడ్డాడన్నారు. అనంతరం వేములవాడకు వచ్చి ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడన్నారు. ప్రైవేట్ ఉద్యోగం చేస్తూనే తెలిసిన వ్యక్తుల దగ్గర గంజాయి కొని అందులో కొంత తాగి మిగిలిన గంజాయిని ఎక్కువ ధరలకు అమ్ముతూ డబ్బులు సంపాదించేవాడు. ఈ క్రమంలో ముస్తాబాద్‌లో గంజాయిని విక్రయిస్తుండగా సమాచారం రావడంతో ఎస్ఐ తన సిబ్బందితో వెళ్లి ముస్తాబాద్ వెళ్లారు. ఓ కల్యాణమండపం వద్ద అనుమానస్పదంగా కనిపించిన వంశీ వద్ద తనిఖీ చేయగా 100గ్రాముల గంజాయి లభించింది. గంజాయిని స్వాధీనం చేసుకుని ఇందుకు ఉపయోగించిన స్కూటీ, మొబైల్ ఫోన్‌ను సీజ్ చేశారు. అనంతరం వంశీని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఆయన తెలిపారు.

కుటుంబ కలహాలతో దినసరి కూలీ ఆత్మహత్య

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 28: మండలంలోని రాచర్లబొప్పాపూర్ గ్రామంలో కుటుంబ కలహాలతో గుంజ గంగాధర్(30) అనే దినసరి కూలీ బుధవారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామంలో గుంజ గంగాధర్ కొంత కాలంగా ఓ ఇంటిని అద్దెకు తీసుకుని దినసరి కూలీగా పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుండేవాడు. కూలీ పనులు లభించక మద్యానికి బానిసయ్యాడు. కొంత కాలంగా ఇంటిలో భార్యాభర్తల నడుమ గొడవలు జరుగుతున్నాయి. పనులు చేయకపోతే కుటుంబ పోషణ గడవడం కష్టంగా మారుతోందని భర్త గంగాధర్‌ను భార్య స్వప్న మందలించింది. దాంతో మనస్తాపం చెందిన గంగాధర్ ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య స్వప్న, ఇద్దరు కొడుకులు శరత్, వరుణ్‌తేజ ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

తిమ్మాపూర్, ఆగస్టు28: అక్రమంగా కబేలాలకు ఆవుల తరలింపు కొనసాగుతూనే ఉంది. మంగళవారం తెల్లవారు జామున ఎల్ఎండీ పోలీసులు, ఎస్‌పిఎఫ్ పోలీసుల ఆధ్వర్యంలో పోలీసులు మండలంలోని రేణికుంట టోల్‌గేట్ వద్ద ఓ లారీలో అక్రమంగా తరలిస్తున్న 48 ఆవులను పట్టుకొని ఎల్ఎండీలోని గోశాలకు తరలించగా అందులో ఊపిరి ఆడక అస్వస్థతకు గురై ఆరు మృతిచెందాయి. ఈ ఘటన మరువకముందే బుధవారం మరికొన్ని ఆవులను అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. తిమ్మాపూర్ సిఐ కె. స్వామి తెలిపిన వివరాల ప్రకారం.. కాటారం నుంచి హైదారాబాద్ వైపునకు ఆవులను తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు వాహనాలను తనిఖీ చేస్తున్న క్రమంలో బుధవారం కంటెయినర్‌లో 24 ఎద్దులు, 4ఆవులు తరలిస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ఆవులను తరలిస్తున్న వాహనం తప్పించుకునే ప్రయత్నంలో సిద్దిపేట జిల్లా గౌరారం పోలీస్‌స్టేషన్ సమీపం వరకు వెళ్లగా, పోలీసులు వారిని వెంబడించి పశువులను తరలిస్తున్న లారీని పట్టుకొని ఎల్ఎండి కాలనీలో గల గోశాలకు తరలించారు. పట్టుకున్న లారీలో 24 ఎద్దులు, 4ఆవులు మొత్తం 28 పశువులు ఉన్నాయి. రెండు రోజులలో మొత్తం 76 పశువులు పట్టుకున్నారు. ఇప్పటి వరకు 10పశువుల వరకు మృతి చెందాయి. పశువులను తరలిస్తున్న ఓనర్ సద్దం, లారీ డ్రైవర్ ఆసిఫ్, లేబర్లు సమీర్, తాహిద్‌లపై ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ స్వామి తెలిపారు.



మృతి చెందిన ఆవులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలి : సీపీ

కోల్‌సిటీ, ఆగస్టు 28 : మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పనిచేసే పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ, వారి కదలికలపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసుకోవాలని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ సూచించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో మావోయిస్టు ప్రభావిత ప్రాంత పోలీస్ స్టేషన్ పరిధిలో పని చేస్తున్న ఎస్‌ఐలకు టాక్టీస్, ఫీల్డ్ క్రాఫ్ట్, మ్యాపింగ్‌పై బుధవారం కమిషరేట్‌లో ఆర్మ్‌డ్ రిజర్వు అధికారులచే శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ మావోయిస్టులు సరిహద్దు ప్రాంతాల్లో ఎలాంటి అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడకుండా వారిని నివారించాలని తెలిపారు. ఫిజికల్ ఫిట్‌నెస్, ఆయుధ వినియోగం, అంబుష్, వెహికల్ అంబుష్, టాక్టికల్ మూమెంట్, పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రాంతం మ్యాప్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, అవసరాన్ని బట్టి అనుసరించాల్సిన టాక్టికల్ ఆపరేషన్స్ వ్యూహంలో మెళకువలతో పరిస్థితులకు అనుగుణంగా వ్యవహరించాలన్నారు. ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీపీ అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ(అడ్మిన్) రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర, ట్రాఫిక్ ఏసీపీ నరసింహులు, ఏఆర్ ఏసీపీలు ప్రతాప్, సురేంద్ర, ఆర్‌ఐ ఆపరేషన్స్, శ్రీనివాస్, ఆర్‌ఐ(అడ్మిన్) దామోదర్, ఆర్‌ఎస్ ఐలు ప్రవీణ్ వెంకటేష్, అనిల్, హెడ్ కానిస్టేబుల్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి క్రీడా పోటీలు

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 28 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మండలస్థాయిలో ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో టి. సురేందర్‌కుమార్ తెలిపారు. 14ఏళ్ల నుంచి 17ఏళ్లలోపు బాల బాలికలకు వేరువేరుగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పెద్దపల్లిలోని ఇండియన్ మిషన్ హైస్కూల్ ఆవరణలో ఈనెల 3 నుంచి 6వ తేది వరకు జరుగు ఈ పోటీలలో పెద్దపల్లి మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచే క్రీడాకారులను ఎంపిక చేసి జిల్లా స్థాయిలో జరుగు పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో పెద్దపల్లి మండల ఫిజికల్ డైరెక్టర్లు, సీఆర్పీలు పాల్గొన్నారు

పుస్తెమట్టెలు అందజేత

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 28 : మండలంలోని హన్మంతునిపేటకు చెందిన మియాపురం రమేష్- భాగ్యలక్ష్మి రెండవ కుమార్తె దివ్య వివాహం సందర్భంగా మ్యాడగొని శ్రీనివాస్ గౌడ్ పుస్తెమెట్టలు అందజేశారు. బుధవారం నిమ్మనపల్లిలోని లంబులాద్రి నరసింహా స్వామి ఆలయంలో వివాహం జరుగగా పెళ్లికి అందించారు. ఈ కార్యక్రమంలో నూనె రాజయ్య, నూనె భూమయ్య, గుర్రం సతీష్ గౌడ్, నాగులమల్యాల వెంకటచారి, కుడిక్యాల రాజయ్య, కుడిక్యాల సతీష్, గోటిముక్కుల మొగిలి పాల్గొన్నారు.

మిషన్ శక్తి పథకంపై అవగాహన

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 28: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మిషన్ శక్తి పథకం మహిళల సాధికారత కోసమేనని జిల్లా మహిళ సాధికారిత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ స్వప్న, ఫైనాన్షియల్ లిటరసీ సంధ్య అన్నారు. బుధవారం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వందరోజుల అవగాహన కార్యక్రమంలో భాగంగా పెద్దబొంకూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, ఉపాధిహామీ పనిలో భాగంగా మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. అలాగే బాలికల రక్షణ, విద్య, లింగ నిర్ధారణను నివారించేందుకే 'బేటీ బచావో.. బేటీ పడావో' పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తోందన్నారు. వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.

కవిత విడుదలపై సంబరాలు

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 28: కవిత విడుదలపై బీఆర్‌ఎస్ నాయకులు మండల కేంద్రంలో బుధవారం సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్, నాయకులు నిదానపురం దేవయ్య, బిట్టు, వడ్లాల శ్రీనివాస్, మాదాసు చందు, ఎండి ఖదీర్ పాల్గొన్నారు.

వాటర్ ప్లాంటు ప్రారంభం

కమాన్‌పూర్, ఆగస్టు 28 : మండలంలోని జూలపల్లిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ ప్యూరిఫైడ్ డ్రింకింగ్ వాటర్ ప్లాంటును బుధవారం గ్రామ కార్యదర్శి అంబటి శంకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జీ హెచ్‌ఎం గంగారాం, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ స్వరూప, వీవో ప్రేమలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

ఉచిత బస్‌పాస్‌లు అందజేత

రామగిరి, ఆగస్టు 28: ఉచిత బస్‌పాస్‌లను విద్యార్థులు వినియోగించుకోవాలని మంథని ఆర్టీసీ డిపోమేనేజర్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని రత్నాపూర్ ప్రభుత్వ పాఠశాలలోని ఉన్నత పాఠశాలకు చెందిన 29 మంది విద్యార్థులకు బస్‌పాస్‌లను అందజేశారు. 12 సంవత్సరాల వయసు కలిగిన విద్యార్థులు రూ.50 చెల్లించి బస్‌పాస్‌లను పొందాలన్నారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ ఏంజెల్, విబివో చంద్రమౌళి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీతంపేటను సందర్శించిన ప్రత్యేక అధికారి

ముత్తారం, ఆగస్టు 28: మండలంలోని సీతంపేటలో ఇటీవల జ్వర పీడితులు ఎక్కువగా ఉండడంతో మండల సందర్శనలో భాగంగా మండల ప్రత్యేక అధికారి రవీందర్ సీతంపేట గ్రామాన్ని బుధవారం సందర్శించారు. అక్కడ ప్రజలతో మాట్లాడి జ్వరాలు తగ్గుముఖం పడుతున్నట్లు తెలుసుకున్నారు. ఎంపీడీవో సురేష్ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

ముత్తారం, ఆగస్టు 28: మండలంలోని ఖమ్మంపల్లిలో అంగన్‌వాడీ సెంటర్-1ను ఎంపీడీవో సురేష్ సందర్శించారు. చిన్నారులకు గుడ్లు, పాలు అందజేస్తున్నారా, బాలింతలకు ఎలాంటి ఆహారం అందజేస్తున్నారనే వివరాలు సేకరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ట్రినిటిలో ప్లేస్‌మెంట్ డ్రైవ్

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 28 : ట్రినిటి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. 21 మంది ఉద్యోగాలు సాధించగా విద్యాసంస్థల వ్యవస్థాపకుడు మనోహర్‌రెడ్డి నియామకపత్రాలు అందించారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు : కలెక్టర్

ధర్మారం, ఆగస్టు 28: గ్రామాల్లో ప్రబలకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులకు సూచించారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించిన తర్వాత మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ప్రతి గ్రామంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో సక్రమంగా జరిగేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆయన సూచించారు. పైపుల లీకేజీ అయితే అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని చెప్పారు. అదేవిధంగా వైద్య శాఖ అధికారుతో సమన్వయం చేసుకుంటూ జ్వరాల వ్యాప్తిని అరికట్టాలన్నారు. గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు తదితర అధికారులు డ్రైడే పాటించాలని సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను వచ్చేనెల 30 వరకు పరిష్కరించాలన్నారు. గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తెలిపారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా అదనపు కలెక్టర్ అరుణశ్రీ, పంచాయతీ అధికారి ఆశాలత, మండల ప్రత్యేక అధికారి రాజేందర్, తహసీల్దార్ రజిత, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీవో రమేష్, పలు శాఖల అధికారులు ఉన్నారు.

పాఠశాలలను సందర్శించిన కలెక్టర్

మండలంలోని పలు పాఠశాలలను, గురుకుల విద్యాలయాన్ని కలెక్టర్ సందర్శించారు. కొత్తూర్‌లో హైస్కూల్, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంను సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, టీచర్లు విద్యా బోధన చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు. కటికెనపల్లి గ్రామంలో పాఠశాలలు, రైతు వేదికను పరిశీంచారు. మల్లాపూర్ గ్రామంలో గల గురుకుల బాలికల విద్యాలయాన్ని సందర్శించి బాలికలతో విద్యా బోధనపై అడిగి తెలుసుకున్నారు. డార్మెటరీ గదులు, నూతన భవన నిర్మాణాన్ని పరిశీలించారు. అనంతరం ధర్మారంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అధికారులకు పలు సూచనలు చేశారు.


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

తిరోగమన దిశలో 'ఖని' పట్టణ అభివృద్ధి

- ఎన్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గోలివాడ ప్రసన్న కుమార్

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 28: గోదావరిఖని చుట్టు పక్కల ఉన్న పట్టణాలు అభివృద్ధిలో ముందుకు పోతుంటే, గోదావరిఖని మాత్రం తిరోగమన దిశలో పోతోందని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ) జిల్లా అధ్యక్షులు గోలివాడ ప్రసన్న కుమార్ ఆరోపించారు. బుధవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రామగుండం శాసన సభ్యులు రాజ్ ఠాకూర్ అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలల కాలం అవుతుందని, ఎమ్మెల్యేగా గెలవక ముందు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఓసీపీ-5 మొదలవక ముందు ఓపెన్ కాస్ట్‌ల ఏర్పాటుకు వ్యతిరేకంగా ధర్నాలు, రాస్తారోకోలు, నిరాహార దీక్షలు చేసిన నాయకులు, ఇప్పుడు రాష్ట్రంలో, నియోజకవర్గంలో, కార్పొరేషన్‌లో అధికారంలో ఉన్నారన్నారు. గోదావరిఖని పట్టణానికి ఓసీపీ-5 గుదిబండలా తయారు అయ్యిందని, ఒకప్పుడు 50 మీటర్ల ఎత్తులో ఉన్న ఓపెన్ కాస్ట్ 60మీటర్లు, 90మీటర్లు, 120మీటర్ల ఎత్తు వరకు పెంచడం జరిగిందని, ఇప్పుడు 150మీటర్ల ఎత్తు పెంచడానికి సింగరేణి యాజమాన్యం ప్రయత్నాలు చేస్తున్నారని, దీనివలన గోదావరిఖని పట్టణ ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని, 150 మీటర్ల ఎత్తు వలన గోదావరిఖని పట్టణానికి అడ్డు గోడ కట్టినట్టు అవుతుందని, ఓపెన్ కాస్ట్ వలన గాలిలో దుమ్ము దూళి చేరి ప్రజలకు శ్వాసకోస సంబంధ వ్యాధులు, గుండె జబ్బులు, చర్మ వ్యాధులు వస్తున్నాయని, ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ పేదల బతుకుల మీద, కష్టజీవుల కడుపుల మీద బుల్డోజర్లు తోలుతున్నాడని, వారు వ్యతిరేకించిన సింగరేణి ఓసీపీ-5 గోదావరిఖని పట్టణాన్ని మింగేస్తున్నా నిమ్మకు నీరెత్తనట్టు వ్యవహరిస్తున్నారని, సింగరేణి యాజమాన్యం ఓపెన్ కాస్టులో వచ్చే మట్టిని మూసివేసిన ఓసీపీల్లో నింపాలని, ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఈ దిశగా ఆలోచన చేయాలని, ఓసీపీ-5 మీద పోరాటం చేయాలని, అంపశయ్య మీద ఉన్న గోదావరిఖని పట్టణానికి అభివృద్ధి ఊపిరులు ఊదాలన్నారు. ఈ విలేకరుల సమావేశంలో చెన్నూరి నాగరాజు, మొలుగూరి మహేష్, ముజాహిద్, కుమ్మరి నాగార్జున, అక్కపెల్లి చంద్రశేఖర్, ఆజాద్, నాయకురాల్లు మడిపెల్లి దేవమ్మ, ఇరుకుల్ల లక్ష్మి, మామిడిపల్లి రాజేశ్వరి, నూనె కనకలక్ష్మి, బద్రి లక్ష్మి, దండవేని రమాదేవి, గుంటి విజయలక్ష్మి పాల్గొన్నారు.

రైతుల వివరాల సేకరణ

రామగిరి, ఆగస్టు 28: మండలంలోని కల్వచర్ల గ్రామంలో వ్యవసాయశాఖ అధికారులు బుధవారం కుటుంబ నిర్ధారణ ప్రక్రియ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రభుత్వం ప్రకటించిన 2024 రుణమాఫీలో భాగంగా గ్రామానికి చెందిన రైతుల కుటుంబ సభ్యుల రేషన్‌కార్డులు, ఆధార్‌కార్డు, ధ్రువీకరణ పత్రాలను స్వీకరించారు. జిల్లా వ్యవసాయ అధికారి దోమ ఆదిరెడ్డి ఆధ్వర్యంలో మండల ఏవో శ్రీకాంత్ సేకరించారు. అనంతరం రుణమాఫీకి సంబందించిన పత్రాలను ఆప్‌లో అప్లోడ్ చేశారు. ఏఈవో అరవింద్, మాజీ జడ్‌పీటీసీ గంట వెంకటరమణరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఎలిగేడు : రైతు రుణమాఫీని వినియోగించుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి ఉమాపతి పేర్కొన్నారు. లాలపల్లిలో బుధవారం రుణమాఫీ కాని రైతుల వివరాలు సేకరించే కార్యక్రమం చేపట్టారు. సామ రాజేశ్వర్‌రెడ్డి, ఏఈవోలు పద్మ, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో సీనియర్ జర్నలిస్టు మృతి

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 28: పట్టణంలోని బండారికుంటకు చెందిన సీనియర్‌జర్నలిస్టు పెర్క రమేష్ మంగళవారంరాత్రి గుండెపోటుతో మరణించారు. పెద్దపల్లి, చెన్నూర్ ఎమ్మెల్యేలు విజయరమణారావు, వివేక్ వెంకటస్వామి, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, పలువురు అధికారులు, జర్నలిస్టులు మృతదేహానికి నివాళులర్పించారు.

సర్వేను వేగవంతం చేయాలి

ఓదెల, ఆగస్టు 28: బీఎల్‌వోలు ఇంటింటా సర్వేను వేగవంతం చేయాలని తహసీల్దార్ యాకయ్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం బీఎల్‌వోలకు ఓటర్ల సవరణపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీడీవో తిరుపతి, డీటీ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

ఎంపీకి సన్మానం

సుల్తానాబాద్, ఆగస్టు 28: పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు కుటుంబ సభ్యులు గురువారం ఎంపీ గడ్డం వంశీకృష్ణను ఘనంగా సన్మానించారు. కొన్ని నెలల క్రితం మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు అనారోగ్యంతో మృతిచెందగా, గురువారం ఎంపీ వంశీ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాజమల్లు చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం రాజమల్లు సతీమణి సుశీల, కోడలు మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ సమతక్రిష్ణ ఎంపీని సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

షీ టీంపై అవగాహన

ఫైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 28: షీటీమ్స్ పనితీరుపై మంగళవారం గోదావరిఖని టూటౌన్ పోలీసులు సింగరేణి స్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. షీటీమ్ ఇంచార్జి ఏఎస్సై మల్లన్న మాట్లాడారు. మహిళలు, యువతుల రక్షణకు బస్‌స్టాప్స్ ప్రధాన చౌరస్తాలు, కాలేజీలు, రద్దీ ప్రాంతాల్లో షీటీమ్స్ ఉంటాయని తెలిపారు. విద్యార్థినిలు, యువతులు ఎవరి ద్వారా వేధింపులకు గురైనట్టు బావిస్తే 6303923700 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచి బాధితులకు న్యాయం జరిగేలా పోలీస్ శాఖ చర్యలు తీసుకుంటుందని ఏఎస్సై తెలిపారు. సోషల్ మీడియాలో అపరిచితుల పరిచయాలకు దూరంగా ఉండాలని సూచించారు. సైబర్‌క్రైం పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

ఈకార్యక్రమంలో ఈటీం సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 28: పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు తెలిపారు. పెద్దపల్లి హనుమాన్‌నగర్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇందిర మహిళా శక్తి ద్వారా ఏర్పాటు చేసిన సూపర్ మార్కెట్‌ను ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. రూ. 3 కోట్ల 3 లక్షలతో కునారం రోడ్డు, చందపల్లి ప్రాంతాల్లోని ఇందిరమ్మ డబుల్ బెడ్‌రూం కాలనీల్లో మౌలిక సదుపాయాల పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి మహిళా శక్తి ద్వారా రాష్ట్ర ప్రభుత్వం చేయూతనిస్తుందన్నారు. ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయంతో మహిళలు వ్యాపార రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. పెద్దపల్లిలో డబుల్ బెడ్‌రూమ్ ఇందిరమ్మ కాలనీల్లో సౌకర్యాలు మెరుగుపరిచేందుకు రూ.5కోట్లు డీఎంఎఫ్‌టీ నిధులను మంజూరు చేయించినట్లు తెలిపారు. పేదల ప్రజల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వమని అన్నారు. అన్నివర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలుచేస్తోందన్నారు. పెద్దపల్లి పట్టణాన్ని గొప్పగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ అరుణశ్రీ, మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మమతారెడ్డి, కమిషనర్ వెంకటేష్, తహసీల్దార్ రాజ్‌కుమార్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పాండవలొంక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తా


పాండవలొంకలో విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న నాయకులు

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 28: జాఫర్‌ఖాన్‌పేట శివారులోని అటవీ ప్రాంతంలో ఉన్న పాండవ లొంక సమస్యలను ఎమ్మెల్యే విజయరమణారావు దృష్టికి తీసుకుపోయి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ ఎంపీపీ కాంగ్రెస్ నాయకులు గోపగోని సారయ్యగౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని వెన్నంపల్లి గ్రామానికి చెందిన పోలుదాసరి మోహన్ పాండవ లొంక ప్రాంతంలో విగ్రహాలను ప్రతిష్ఠించారు. మహా గణపతి, శివుడు, నాగులమ్మ, లక్ష్మీదేవి తదితర విగ్రహాల ప్రతిష్ఠ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సారయ్యగౌడ్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా పాండవలొంక ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా చేయడానికి ఎన్నోసార్లు గతంలో సంబంధిత అధికారులకు వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ ప్రాంతానికి రహదారి లేని కారణంగా పర్యాటకులు ఇబ్బంది పడుతున్నారని, ఈ విషయంపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళతానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు జెట్టి దేవేందర్, పనాస మల్లయ్య, పోలు దాసరి మోహన్, ఎండి ఖలీమ్ ఉద్దీన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'అర్హులందరికీ రుణమాఫీ'

పాలకుర్తి,ఆగస్టు 28: అర్హులైన రైతులందరికీ తప్పకుండా రుణ మాఫీ జరుగుతుందని, ఎవరూ ఆందోళన చెందవద్దని పాలకుర్తి మండల వ్యవసాయశాఖ అధికారి బండి ప్రమోద్ అన్నారు. బుధవారం మండలం పరిధిలోని కన్నాల, రాణాపూర్ గ్రామాల్లో రైతుభరోసా పంట రుణ మాఫీ యాప్‌లో కుటుంబాల వివరాలను ఆయన సేకరించారు. ఈ సందర్భంగా ప్రమోద్ మాట్లాడుతూ వివిధ కారణాల వల్ల మాఫీకి అర్హత పొందలేకపోయిన రైతుల వివరాల నమోదుకు రైతుభరోసా పంట రుణమాఫీ యాప్‌ను రాష్ట్ర వ్యవసాయశాఖ రూపొందించిందని తెలిపారు. రుణ మాఫీ కాలేదని ఫిర్యాదు చేసిన రైతుల ఇళ్ల వద్దకు వ్యవసాయ శాఖ అధికారులు వెళ్లి ముందుగా వారి రుణఖాతాలు, ఆధార్‌కార్డులను తనిఖీ చేస్తారన్నారు. అనంతరం కుటుంబ సభ్యుల వివరాలు తీసుకొని యాప్‌లో అప్‌లోడ్ చేస్తారన్నారు. అందరికీ రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం స్పష్టం చేసిందని ప్రమోద్ తెలిపారు.

అపస్మారక స్థితిలో ఉన్న చిన్నారిని కాపాడిన వైద్యులు

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 28: ఓ చిన్నారి అపస్మారక స్థితిలో ఆసుపత్రికి రాగా గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వైద్యులు ఆ చిన్నారికి ఆయువు పోశారు. మంథని మండలం కన్నాలకు చెందిన ఉడుత శ్రావణి(12) ఈ నెల 24న ఇంట్లో అకస్మాత్తుగా పడిపోయి అపస్మారక స్థితిలోకి చేరుకోగా గ్రామంలో ఓ ఆర్‌ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. అక్కడి వైద్యుడు పరీక్షించి, చిన్నారి పరిస్థితి విషమించిం దని, గోదావరిఖనికి తీసుకువెళ్లాలని సూచించడంతో చిన్నారి తల్లి దండ్రులు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తీసుకువచ్చారు. అప్పటికే చిన్నారి పరిస్థితి విషమంగా మారింది. పిల్లల వైద్యుడు ఆదిష్‌రెడ్డి వెంటనే చిన్నారికి వైద్యం అందించడంతో ప్రాణాపాయం తప్పింది. పాముకాటు వల్లనే శ్రావణికి అలా జరిగిందని, ఇంట్లో రాత్రి వేళల్లో అరుగు మీద నిద్రిస్తున్న సమయంలో పాముకాటు వేసి ఉంటుందని వైద్యుడు ఆదిష్‌రెడ్డి చెప్పారు. శ్రావణి ఆరోగ్య పరిస్థితి మెరుగుపడటంతో ఆసుపత్రి నుంచి బుధవారం డిశ్చార్జ్ చేశారు. శ్రావణికి ప్రాణం పోసిన వైద్యులకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపినారు. చిన్నారి ప్రాణాలను కాపాడిన వైద్యులను ప్రిన్సిపాల్ హిమబిందువు, సూపరింటెండెంట్ దయాల్‌సింగ్ అభినందించారు.

ఆర్‌ఎంపీ, పీఎంపీల నిరసన

కమాన్‌పూర్, ఆగస్టు 28: ఆర్‌ఎంపీ, పీఎంపీలపై జరుగుతున్న దాడులకు నిరసనగా గురువారం నుంచి గ్రామాల్లో ప్రథమ చికిత్స సేవలు నిలిపివేస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షులు కొలిపాక శంకర్ తెలిపారు. దాడులను వ్యతిరేకిస్తూ బుధవారం ఆర్‌ఎంపీ, పీఎంపీల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద జిల్లాలోని ఆర్‌ఎంపీ, పీఎంపీలందరూ నిరసన ప్రదర్శన నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎంపీ, పీఎంపీల అసోసియేషన్ సభ్యులు బర్ల శ్రీనివాస్, భాస్కర్, రాసకొండ శ్రీనివాస్, నాగేందర్, చొప్పరి రాజు, శ్రీనివాస్, సత్యనారాయణ, జగన్, మహేష్, కృష్ణంరాజులతో పాటు తదితరులు ఉన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో క్రమశిక్షణ

మంథని, ఆగస్టు 28: భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో విద్యార్థుల్లో మంచి క్రమశిక్షణ, సమాజ సేవ భావం పెంపొందుతాయని ఏఎస్‌ఐ మల్లయ్య అన్నారు. స్థానిక కాకతీయ హైస్కూల్‌లో బుధవారం జరిగిన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరి ఉత్తమ పౌరులుగా ఎదగాలని సూచించారు. మంథనిలో తొలిసారిగా తమ పాఠశాలలో భారత్‌స్కౌట్స్ అండ్ గైడ్స్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని ప్రిన్సిపాల్ ప్రదీప్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రతినిధులు జొన్నల రవీందర్, జ్యోతి, శంకర్, యాదగిరిగౌడ్, పాఠశాల డైరెక్టర్లు రవికిరణ్‌రెడ్డి, శ్రావణ్‌రెడ్డి, స్రవంతి, పావనిలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ముత్తారం, ఆగస్టు 28: మండలంలోని ఖైదంబండ గ్రామ పంచాయతీ పరిధిలో బుధవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. విస్తృతంగా ప్రతి గ్రామంలో జ్వరాలు ఉండడంతో వైద్యాధికారి డాక్టర్ అమరేందర్‌రావు సిబ్బందితో కలిసి క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో 75 మందికి పరీక్షలు నిర్వహించగా అందులో 18 మంది జరాలు మిగతా వారికి ఒళ్ళు నొప్పులు, కాళ్లు చేతులు లాగడం వంటి లక్షణాలు ఉండగా జ్వరాలు ఉన్నవారికి అక్కడే డెంగు మలేరియా టెస్టులు నిర్వహించారు. అందరికీ మందులు పంపిణీ చేయడంతో పాటు ఆరోగ్య విద్యా బోధన పరిసరాల పరిశుభ్రత దోమల నివారణ వ్యక్తిగత పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి డిఆర్డిఓ రవీందర్, ఎంపీడీవో సురేష్, వైద్య సిబ్బంది రమాదేవి, శ్రీనివాస్, లావణ్య, స్రవంతి, శశికళ కల్పన, లత, రజిత మరియు గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక లారీలను అడ్డుకున్న గ్రామస్థులు


రంగయ్యపల్లిలో గ్రామస్థులు అడ్డుకున్న ఇసుక లారీలు

ముత్తారం, ఆగస్టు 28: ఇసుక లారీలతో రోడ్డుపై దుమ్ము ధూళి లేస్తోందని బుధవారం రంగయ్యపల్లి గ్రామస్థులు లారీలను అడ్డుకున్నారు. మండలంలోని జిల్లాలపల్లి, ఖమ్మంపల్లి వద్ద ఉన్న నిల్వ ఇసుకను సదరు కాంట్రాక్టర్‌లు లారీలతో తరలిస్తున్న తరుణంలో ఖమ్మంపల్లి నుంచి రంగయ్యపల్లి వరకు రోడ్డుపై ట్యాంకర్‌తో నీళ్ళు కొట్టకుండా లారీలలో ఇసుకను తరలిస్తున్నారని గ్రామస్థులు ఆరోపించారు.రు. లారీలను అడ్డుకున్నప్పటికీ కాంట్రాక్టర్ కానీ, అధికారులు కానీ, స్పందించడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి నీళ్ల ట్యాంకర్‌తో దుమ్ము లేవకుండా ప్రధాన రహదారిపై ట్యాంకర్‌తో నీళ్ల కొట్టాలని కోరుతున్నారు.



నియామక ఉత్తర్వుల అందజేత


నియామక ఉత్తర్వులను అందిస్తున్న ప్రాజెక్టు ఇన్‌చార్జి

రామగిరి, ఆగస్టు 28: సింగరేణి ఏపీఏ డివిజన్ పరిధి అడ్రియాల ప్రాజెక్టులో శిక్షణ పూర్తిచేసుకున్న అభ్యర్థులకు బుధవారం ఇన్‌చార్జి నాగేశ్వర్‌రావు నియామక ఉత్తర్వులు అందజేశారు. ఎంవీటీసీలో శిక్షణ పూర్తి చేసుకున్న పది మంది అభ్యర్థులకు జీఎం కార్యాలయంలో ఉత్తర్వులను అందజేశారు. అధికారులు సత్యనారాయణ, సుదర్శనం, మల్లన్న, క్రాంతికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేసిన జీఎం

గోదావరిఖని, ఆగస్టు 28: మెడికల్ ఇన్‌వాలిడేషన్, చనిపోయిన ఉద్యోగుల డిపెండెంట్స్ 9మందికి ఆర్‌జీ-1 జీఎం లలిత్ కుమార్ బుధవారం తన కార్యాలయంలో కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సీఎండీ బలరాం చొరవతో త్వరగా నియామక ఉత్తర్వులు అందించామన్నారు. మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసున్న వారు అన్‌ఫిట్ అయిన వెంటనే వారి కుటుంబ సభ్యుల్లో డిపెండెంట్ కింద పోస్టింగ్ అందించటం జరుగుతుందన్నారు. వీరికి ఆర్‌జీ-1ఏరియాలో పోస్టింగ్ ఇవ్వనున్నట్టు తెలిపారు. నూతన ఉద్యోగులు ఇప్పటి పరిస్థితులకు అనుగుణంగా పని నైపుణ్యాన్ని మెరుగుపరచుకొని కంపెనీ పురోభివృద్ధికి పాటుపడాలని సూచించారు. సింగరేణి భవిష్యత్ యువ ఉద్యోగుల చేతులలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబు, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రెటరీ అరెల్లి పోషం, సీఎంవోఏఐ ప్రతినిధి క్రాంతి కుమార్, సీనియర్ పీఓ శ్రావణ్ కుమార్, ఏఐటీయూసీ ప్రతినిదులు రాజు, రంగు శ్రీను, ఏరియా సేఫ్టీ అధికారి భైద్య, ఏజెంట్ చిలుక శ్రీనివాస్, అధికారులు, దాసరి వెంకటేశ్వర్‌రావు, కుమారస్వామి, రవీందర్ రెడ్డి, ఆంజనేయులు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


నియామక పత్రాలు అందజేస్తున్న జీఎం లలిత్ కుమార్

రేపటి నుంచి శిక్షణా తరగతులు ప్రారంభం

ఫైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 28: సింగరేణి సేవా సమితి ఆర్జీ-2 ఆధ్వర్యంలో 2024-25 సంవత్సరానికి వృత్తి విద్యా కోర్సుల శిక్షణా తరగతులు ఈనెల 29న ప్రారంభించనున్నట్టు ఏరియా అధికార ప్రతినిధి రాజేంద్ర ప్రసాద్ ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక కమ్యూనిటీ హాల్‌లో జీఎం సూర్యనారాయణ, ఏరియా సేవా సమితి అధ్యక్షురాలు మాలతీసూర్యనారాయణలు ముఖ్యఅతిథులుగా హాజరై కోర్సులను ప్రారంభించనున్నట్టు తెలిపారు. టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, కంప్యూటర్ కోర్సులకు దరఖాస్తులు చేసుకున్న మహిళలు హాజరుకావాలని పేర్కొన్నారు.